శ్రీ మధురాంతకం నరేంద్ర

మళ్ళీ వచ్చేశాడు!

"వచ్చాడు!"

"వచ్చేశాడు!!"

"మళ్ళీ వచ్చేశాడు!!!"

చేతిలోని పద్మూడు ముక్కల్నీ చిందర వందరగా టీపాయ్ మీదికి విసిరేసి, కిటికీలోంచీ తొంగిచూస్తూ బిగ్గరగా కేకలేశారు–మిత్రులిద్దరూ.

వాళ్ళకంత కుతూహలాన్ని కలిగిస్తూ విచ్చేసిన వ్యక్తి యెవరా అనుకుంటూ నేనూ తొంగిచూశాను.

మానవుడి అదుపాజ్ఞలకు ససేమిరా లొంగనని మొండికెత్తినట్టున్న నల్లటి యెనుబోతులాంటి జావా మోటర్ బైక్ మా యింటికి వంద గజాల దూరంలో ఆగింది. దాన్ని అధిరోహించివున్న వ్యక్తి వేసుకొన్నది తెల్లటి బెల్‌బాటమ్ పాంటు తొడుక్కున్న నల్లటి కోటు షర్టును కనిపించనివ్వడం లేదు. కోటు మధ్యలో నుంచీ నల్లటి టై వయ్యారంగా ఎగురుతోంది. శుభ్రంగా గీక్కున్న గడ్డంపైన మీసాలు సైడ్‌లాక్స్‌తో కలిసిపోయినట్టుగా కనబడుతున్నాయి. ముఖంలోని భావాలు కనబడనివ్వకుండా కళ్ళకు నల్ల కళ్ళజోడు ... మోటర్‌బైక్ పైన ప్రయాణం చేయడంవల్ల రేగిపోయిన జుట్టు ... స్కూటర్‌ను ఆపుతూ క్రింద పెట్టిన కాలుకు నల్లటి 'షూ' కనబడుతోంది. అదిగో! అదేమిటి? చేతులకు గ్లవుసస్ గూడా తొడుక్కున్నట్టున్నాడే!

తెలుగు దేశంలో సినిమాల్లో తప్ప నిజ జీవితంలో అలాంటి దుస్తులెవరూ తొడుక్కోరన్న నమ్మకం నాకా క్షణంలో తొలగిపోయింది.

మోటర్‌బైక్ ఆగుతూనే వెనక సీట్లోంచీ వొకస్త్రీ కిందికి గెంతింది. ఆమె యెవరోగానీ చూడ్డానికి సర్కస్ కంపెనీ వాళ్ళ తాలూకులా కనిపించింది. వేసుకున్న డ్రస్సు అలాగే వుంది మరి! ముఖంలో బొట్టువున్న సూచనలేమీ కనిపించడంలేదు. మగరాయుడిలా వుంది ఆమె ఆకారం. ఆవిడ వేసుకున్న జడ – చిన్నతనంలో మా చెల్లెలికి తల స్నానం చేసిన రోజున మా అమ్మ అలాంటి జడే వేసేది; అదేమిటని అడిగితే మా చెల్లెలు 'పోనీటైల్' అంటూ కళ్ళు గుండ్రంగా తిప్పేది.

అతడిరాకను పదిమందికీ తెలియజేయడంకోసం గొంతుచించుకొని బరాబరులు పలుకుతున్న మోటర్‌బైక్ శబ్దానికి చుట్టుప్రక్కల యిండ్లలోని మనుషులంతా బయటికొచ్చి చూస్తున్నారు.

"ఎవర్రా భాషా అతను?" అంటూ ప్రశ్నించాను.

ఆ ఆగంతకుడు మోటర్ బైక్‌కు స్టాండువేసి నిలబెట్టి యెదురుగావున్న మట్టిమిద్దెలోకి దూరి మాయమైపోయిన తరువాత "ఏమిట్రా అడిగావ్?" అంటూ నన్నే ప్రశ్నించాడు భాషా.

"అదేమిటి? అతడా యింట్లోకి వెడుతున్నాడేమిటి?" అని అడిగాను ఆశ్చర్యంగా.

"బలే బాగుందిలే! ఆయనగారి యిల్లే అది. అక్కడికి పోకుండా యింకెక్కడికి పోతాడు?" నవ్వేశాడు మూర్తి.

"అంటే...?"

"నాయనా రాజా! నువ్వు మనవూరొదిలిపెట్టి నాలుగయిదు సంవత్సరాలు కాలేజీ చదువులు వెలగబెట్టావే అనుకో – అంత మాత్రానికే మనవూరి మనుషుల్ని మరచిపొమ్మన్నారా చెప్పు?" నిలదీశాడు మూర్తి.

"అతగాడు మనవూరివాడా?" మళ్ళీ ఆశ్చర్యపడక తప్పలేదు.

"పూర్తిగా రాజుదే తప్పని చెప్పడానికి వీల్లేదురా మూర్తీ! ప్రస్తుతం ఆయనగారు వచ్చింది సరికొత్త వేషంలోగదా! అందుకే గుర్తుపట్టలేకపోయాడు." అంటూ మూర్తికి చెప్పి, తరువాత నావైపు తిరిగి "పోనీ నీకు ఆ యిల్లు యెవరిదో తెలుస్త్రా రాజా?" అని అడిగాడు భాషా.

"నా డిగ్రీ చదువు మూలంగా అటు పుట్టికీ. ఇటు స్వర్గానికీ దూరమై యిలా తయారయ్యాననుకో – కానీ నన్ను ఈ విషయంలో పూర్తిగా తీసేయకురా భాషా! ఆ యిల్లు ఎవరిదో గూడా తెలియదని అనుకుంటున్నావా నాకు? అది శంకరయ్య యిల్లు..."

"శంకరయ్య కెందరు బిడ్డలో తెలుసా?"

"ఎందుకు తెలియదు? వీధిలో ఎప్పుడూ గోలీలాడుకుంటూ వుంటాడే – వాడి అసలు పేరేమిటో తెలియదు. వాణ్ణి అందరూ 'బుజ్జి' అని పిలుస్తూ వుంటారు, వాడొకడు. తరువాత సంతల వ్యాపారం చేస్తూ వుంటాడు చూడు, చంద్రం...ఆడపిల్ల లెందరో అంతగా గుర్తు లేదు. ఎప్పుడూ లోటా వొకటి చేతబట్టుకుని మా యింటికి కూర కావాలంటూ వస్తూంటుంది వొకపిల్ల...సర్వకాలాల్లోనూ మాసిపోయిన పూలపావడా, దానిపైన నల్ల రంగు జాకెట్టు వేసుకొని వుంటుంది. ఆ పిల్లకు యింకో జత బట్టలు గూడా లేవా–అని అనుకునేవాణ్ణి చూసినప్పుడల్లా. దానిపేరు..."

''మణి...'' భాషా గుర్తు చేశాడు.

''ఇంకా పెళ్ళయిపోయిన అమ్మాయొకతి వున్నట్టు జ్ఞాపకం. తరువాత ... అవును – వీళ్ళందరికీ పెద్దవాడు వొకతనున్నట్టు గుర్తు ... నిజమేనా?'' అంటూ లెక్కలో నాకు సందేహం వచ్చిన చోట ఆగిపోయాను

''ఉన్నట్టుగాదురా రాజా! ఉన్నాడు. అతడింకెవరో గాదు. ఇతడే! ''

''ఎవరూ? ఇతనేనా అతను?'' ఆశ్చర్యపోతూ అన్నాను. ''ఇతగాడి గురించే గదూ – బెంగుళూరో, మదరాసో యెక్కడో వున్నట్టు చెబుతూ వుండేవాళ్ళు...''

''బెంగుళూరుగాదు, మదరాసే. వీడేవాడు—నరసింహులు...''

''నరసింహులు మనం హైస్కూల్లో చదివేటప్పుడను కుంటాను, సంతల్లో లంగరు పెట్టుకుంటూ తిరుగుతూ వుండే వాడు. ఒకసారెప్పుడో పోలీసులు పట్టుకెళ్ళినట్టుగూడా జ్ఞాపకం...'' కొంచెం కొంచెంగా గుర్తుకు తెచ్చుకోసాగాను.

''ఫర్వాలేదురా రాజా! నువ్వు మరీ మందమతి వేమీగాదు నీకు బాగనే జ్ఞాపకముంది...'' మెచ్చికోలుగా చూశాడు భాషా.

''నేను కాలేజీకి వెళ్ళిపోయినందువల్లనేమో – నాలుగైదు సంవత్సరాలుగా అతగాడినెప్పుడూ చూళ్ళేదు. సెలవుల్లో వచ్చి నప్పుడు గూడా కనబడలేదు. ఎప్పుడో మీరే చెప్పారు – మదరాసు వెళ్ళిపోయాడని. అది సరే, అతణ్ణి చూడగానే పేకముక్కల్నిగూడా విసిరిపారేశారు. అతడొచ్చినంత మాత్రాన మీకెందుకంత ఆనందం? వచ్చేశాడు వచ్చేశాడంటూ కేరింతలు కొట్టారెందుకు?...''

పేకముక్కల్ని సర్ది పెడుతూ ''ఇక మనకీ పేకా టెందుకురా రాజా! కాలక్షేపం కోసం పేకాట యిక యెందుకూ పనికిరాదని నీ కర్థంగాలేదా యేమిటి?'' అంటూ నవ్వేశాడు మూర్తి.

''అంటే...?''

''జీవంలేని పేకముక్కలతోనూ, చదరంగపు బంటులతోనూ అగచాట్లు పడాల్సిన కర్మ మనకింకేం పట్టింది? నూరు సినిమా లకూ, వెయ్యిసర్కస్సులకూ ధీటు–నర్సింహు లొచ్చేశాడు మనకిక కాలక్షేపానికేం కొదవలేదు. పై పెచ్చు చూడనుమూడనూ కథ రస పాకాన పడ్తుంది. జరగను జరగనూ ఎంతో థ్రిల్లింగా వుంటుంది'' పకపకా నవ్వసాగాడు భాషా.

''నర్సింహులు అంత బాగా కబుర్లు చెబుతాడా?'' అని అడిగాను.

''కబుర్లా? భలేవాడివే! కాకరకాయ లనలేకపోయావు...'' నన్ను అమాయకుడిని చూసినట్టుగా చూస్తూ మరింత బిగ్గరగా నవ్వసాగాడు భాషా. మూర్తి కూడా శ్రుతి కలిపాడు.

''విషయమేమిటో చెప్పకుండా అలా నవ్వుతారెందుకు?'' అంటూ విసుక్కొన్నాను.

''నీకు కోపం వచ్చినట్టుందే! అయితే నీకు నర్సింహులు గురించి యేమీ తెలియదన్న మాట...'' నవ్వడం ఆపేసి బుద్ధిమం తుడిలా అడిగాడు మూర్తి.

''తెలియదనే చెబుతున్నాను. మీకు తెలిసిందేమిటో చెప్పి యేడవగూడదూ?''

''అలా కసురుకోకురా బాబూ! అయితే నీకు చెప్పాల్సిన విషయాలు చాలా వున్నాయి. ముందు కాస్సేపాగు. సిగరెట్టు వెలి గించుకోనీ.'' అంటూ జేబులోంచి సిగరెట్టు ప్యాకెట్టు పైకితీసి తలా వొకటిచ్చి తానూ వొకటి తీసుకుని, అన్ని సిగరెట్లనూ తన సిజర్ లైటరుతోనే వెలిగించాడు మూర్తి.

మావూరు పల్లెటూరూగాదు. పట్నమూగాదు. ఆరెండింటి లక్షణాలూ వున్నపేట. దాదాపు అయిదు వందల యిళ్ళుంటాయి. అందులో నాలుగోవంతు ముస్లిములు. మిగిలినవాళ్ళంతా హిందువులే!

మాది అసలు సిసలయిన రైతుకుటుంబం. పది పదిహేను మడకల సేద్యం. తొలికోడి కూసినప్పుడు పొలానికివెడితే, మానాన్న గారు తిరిగి యింటికి రావడానికి రాత్రి యెనిమిది గంటలు దాటు తుంది. నేనొక్కణ్ణే మగసంతానం. పైరుకు సమయానికి యెరు వెయ్యడ మెంత ముఖ్యమో, నెల నెలా నాకు డబ్బులు పంపడం గూడా అంతే ముఖ్యమనుకున్నారు ఆయన. నేను చదువుతున్న చదు వేమిటో ఆయనకు స్పష్టంగా తెలియదు. ఏదో చదువుతున్నానని మాత్రం తెలుసు. ఎరువేస్తే పైరు మంచి ప్రతిఫల మిస్తుంది. అలాగే నేనూ తగిన ప్రతి ఫలాన్ని యివ్వవలసివుంది. అయినా డిగ్రీ వెలిగించిన నాకు వుద్యోగం దొరకలేదు. 'రాకుంటే పోయింది. ఉద్యోగం లేకుంటే మనకు జరగకపోతుందా?' అన్నదే మా నాన్న గారి వాదం. కానీ నా ప్రయత్నాలు నేను మానలేదు. ప్రస్తుతం గిరికీలు కొడుతున్న నిరుద్యోగ పర్వంలో నాకు యీ మిత్రులిద్దరూ తోడయ్యారు.

మూర్తిదిగూడా రైతు కుటుంబమే! నలుగురైదుగురు అన్న తమ్ముళ్ళమధ్య ముద్దుగా పెరిగినవాడు. పొలం పనులు అతడి కేమాత్రమూ కాబట్టలేదు. చదువొంటబట్ట లేదు. ఊళ్ళోవున్న హైస్కూల్లోఎస్సెస్సీ పరీక్ష పైన రెండుసార్లు దండయాత్రచేసి ఇక లాభంలేదనుకొని మానేశాడు. ఊరంతా బలాదూర్లు కొడుతూ తిరగడం అతడి దినచర్య.

భాషా తండ్రి సీజనల్ మర్చెంటు. మామిడికాయల కాలంలో మామిడికాయల వ్యాపారం, చింతకాయల కాలంలో చింతకాయల వ్యాపారం, యిలా ఆయనకు నాలుగైదు రకాల వ్యాపారాలున్నాయి. పనిలోకి దిగకపోతే సోమరిలా తిరుగుతూనే వుండడం, దిగాడంటే దున్నపోతులా అదే లోకమనుకోవడం భాషా స్వభావం. ఎస్సెస్సీ పాస

య్యాక చదువుకొక నమస్కారం పెట్టేశాడు. వ్యాపారానికి సంబంధించిన లెక్కలన్నీ నోటితోనే చేసేయగలడు.

ఈ మిత్రులిద్దరూ చిన్నతనంలో నాతోనే చదువుకున్నారు. సెలవుల్లో వచ్చినప్పుడు నాకు కంపెనీ యిచ్చేవాళ్ళు.

మా యింటి మిద్దెపైన యేకాకిలా కనిపించే గది మా క్లబ్బు. అందులో సిగరెట్లు కాల్చుకున్నా, పేకాటసాగించినా మమ్మల్ని గమనించే వాళ్లెవరూ వుండరు.

తాపీగా సిగరెట్టు త్రాగుతూ, పొగ రింగులు రింగులుగా వయ్యారాలుపోతూ వుండగా చెప్పసాగాడు **మూర్తి**— "సంతలకు తిరుగుతూ వొకటయినా బాకీ లేకుండా అన్ని దురలవాట్లూ నేర్చుకున్నాడు నర్సింహులు. అతణ్ణి బాగుపరచాలంటే ముకుదాడొకటి తగిలించాల్సిందే ననుకున్నాడు వాడినాన్న శంకరయ్య. మన దేశంలో ఆడపిల్లలకు కరువా? ఓ దౌర్భాగ్యురాలితో వాడి పెళ్లి జరిగింది. పిల్లలుగూడా పుట్టారు. బహుశా నువ్వూ చూసేవుంటావు. వీధిలో చొక్కా నిక్కరు లేకుండా దిగంబరంగా తిరుగుతూవుండే అయిదారేళ్ల అబ్బాయి, అమ్మాయి ఎదురయితే వాళ్లు తప్పకుండా నర్సింహులు కొడుకూ, కూతురే అయివుంటారు. పెళ్లిచేసినందువల్ల అదనంగా యింకా వొకరిద్దరిని పోషించాల్సిన బాధ్యత మాత్రమే శంకరయ్యకు కలిగినమేలు. ఎక్కడికిపోతాడో, యెప్పుడు పోతాడో వరసగా రెండుమూడురోజులు అయిపులేకుండా పోతాడు. వచ్చాడో యింట్లో అబ్బాకొడుకులమధ్య జగడాలు ప్రారంభమవుతాయి. ఓసారి పెద్ద తగాదా జరిగింది. అతడిలో చలనం వచ్చింది. ఉన్నట్టుండి మాయమైపోయాడు. పోవడం పోవడం సంవత్సరం వరకూ పత్తాలేకుండా పోయాడు. తరువాత వొకనాడు యిలాగే అనుకోకుండా వూడిపడ్డాడు. ఎలావచ్చాడంటావు? ఫారిన్ దొరలాగా వచ్చాడు. పెద్ద సూట్‌కేసు. దాన్నిండా రేడియోలు, ట్రాన్సిస్టర్లు — లాంటి ఖరీదయిన వస్తువులు. చివరకు తేలిన విషయమేమంటే యిన్నాళ్లూ మదరాసులోనే వున్నాడట! పెద్ద మెకానిక్ దగ్గర అసిస్టెంటుగా చేరాడట! తరువాత తానే ప్రత్యేకంగా వొక వర్క్‌షాపు పెట్టుకున్నాడట! ఆమాట లెవరూ నమ్మలేదనుకో. ఇంకా యిలాంటి విషయాలే చాలా చెప్పాడు. ఎవరో సినిమా యాక్టరు చెల్లెల్ని పెళ్లాడాననిగూడా చెప్పాడు. అలా అతగాడు వచ్చినరోజు సాయంత్రమే మొదటి ప్రదర్శనం ప్రదర్శించబడిపోయింది."

"ప్రదర్శనమా? అంటే..." అంటూ అడ్డుతగిలాను.

"మరేంలేదు. నర్సింహులు తాగుతాడు..."

"తాగితే ఎవరికేం నష్టం? వాడి ఆరోగ్యమే పాడవుతుంది."

"కేవలం తాగినంత మాత్రాన నర్సింహులుకు తృప్తికలగదు. గొంతులో చుక్క పడగానే అల్లరి చేయడం మొదలుపెడతాడు. ఎదుటివ్యక్తి యెంత మర్యాదస్తుడయినా అతడికప్పుడు భయం వుండదు. కనిపించిన ఆడదానితోనల్లా సరాగాలు పోతాడు. ఎదురైన మగవాడినల్లా కౌగిలించుకోబోతాడు. చుట్టూ జనం పెరిగేసరికి అతగాడి కుత్సాహమూ పెరిగిపోతుంది. వాళ్లు నవ్వుతూ వుంటే తన గొప్పతనంచూసే నవ్వుతూ వున్నారని అనుకుంటాడు. ఒకసారేమైందో తెలుసా? బజారు వీధిలో రామలింగం వున్నాడు చూశావూ." మూర్తి నవ్వసాగాడు. భాషకుకూడా ఆ సంఘటన గుర్తుకొచ్చినట్టుంది. తానూ పకపకా నవ్వసాగాడు.

"చెప్పయినా నవ్వండి లేకపోతే నవ్వయినా చెప్పండి..." అన్నాను విసుగ్గా.

రెండు మూడు నిముషాలు అదేపనిగా నవ్వి ఆ తరువాత తమాయించుకోగలిగారు. **మూర్తి** మళ్లీ చెప్పసాగాడు — "రామలింగాన్ని తెలుసా నీకు? లావుగా, పొట్టిగా చిన్నసైజు యేనుగులా వుంటాడు. బొట్టలాంటి కడుపుంటుంది. వడ్డీవ్యాపారం చేస్తూ వుంటాడు. ఒకనాడు పూటుగా తాగి వాగుతున్న నర్సింహులు చుట్టూ నలుగురైదుగురు పనీపాటా లేనివాళ్లు చేరారు. తాను చేయలేని పనేమీ లేదని అన్నాడట నర్సింహులు. అయితే రామలింగం పంచె పెరికి పారేయమన్నారు వాళ్లు. 'ఓస్... అదెంతపని...' అంటూ తూలుతూ తూలుతూ రామలింగం దగ్గరికి చేరాడు నర్సింహులు. వాసన తగలగానే రామలింగం భయపడుతూ దూర దూరంగా వెనక్కే నడవసాగాడు. అయినా వీడూరుకున్నాడా? పులిలా దూకేశాడు. జరగాల్సినపని జరగనే జరిగింది. డ్రాయరే లేకపోతే వస్త్రాపహరణం పూర్తిగా జరిగేదే! పంచెపోతే పోయింది లెమ్మని దూరంగా పరిగెత్తసాగాడు రామలింగం. ఆ సీను చూసి తీరాల్సిందేరా రాజూ! కిరసనాయిలు డ్రమ్ము దొర్లిస్తూ వుంటారే — అలాగుంది అతగాడు పరిగెడుతుంటే ... రొప్పుతూ, సోలుతూ యింట్లోకి వెళ్లి తలుపేసుకున్నాడు. నర్సింహులు అంతటితో వూరుకున్నాడనుకుంటున్నావా? ఆ గ్లాస్కోరు పంచెను తీసుకెళ్లి వో ముష్టివాడి చేతిలో పెటి కట్టుకోమన్నాడు. గంట తరువాత మరో పంచెను కట్టుకొని వచ్చి 'నా పంచెను నాకు తెచ్చిపెట్టరాకూసీ' అంటూ కూర్చున్నాడు రామలింగం. నర్సింహులుకు కొంచెం నిషా తగ్గినట్టుగా తోచిందేమో — అప్పటికప్పుడు ప్రక్కనేవున్న వో వ్యక్తికి చేతివాచీని నూరురూపాయిలకు అమ్మేశాడు. అడ్వాన్సుగా అతడిచ్చింది పదిరూపాయలే! ఆ పది రూపాయలూ చేత బుచ్చుకొని సారాయంగడిలోకి దూరేశాడు. రావడం రావడమే యీసారి పంచెగూడ లాగి పారేస్తానంటూ రామలింగంపైన పడ్డాడు. మళ్లీ మొదలయ్యింది పరుగుపందెం. రోడ్డు రోలరులా దొర్లుతూ రామలింగం ...వెనక పడుతూ లేస్తూ నర్సింహులు...అబ్బబ్బ! ... ఆ దృశ్యం చూసి తీరాల్సిందేగానీ చెప్పలేం." మూర్తి నవ్వసాగాడు.

"మొత్తానికి రామలింగానికి వొక పంచె లాసన్నమాట" **అన్నాను.**

"ఊహూ! రామలింగం తక్కువ తిన్నాడనుకున్నావా? వాళ్లింటికి వెళ్లి శంకరయ్యను పట్టుకున్నాడు. అతగాడెక్కడి నుంచీ తెచ్చిపెడతాడు? నర్సింహులు వాచీ అమ్మేశాడు చూడు— వాడి పేరు రహీం. వాడి నడిగి మిగిలిన తొంభై రూపాయలూ

తీసుకొచ్చి రామలింగాని కియ్యవలసింది యిచ్చేశాడు. నర్సింహులు వూరుకున్నాడా ? నా డబ్బు మా నాయన కెందుకిచ్చావని రహీం వెంట పడ్డాడు. అంటే యేమిటి ? ఇంకో ప్రదర్శన మొదలయిం దన్నమాట !...''

కాస్సేపు ఆగి తరువాత మళ్లీ చెప్పసాగాడు మూర్తి—''ఇలా చెబుతూపోతే వొకటా, రెండా ? నీకు వినే వోపికే వుండాలిగానీ— యెన్నయినా చెప్పగలను. అయినా వింటే యేమొస్తుంది, చూడాలి గానీ. వచ్చేశాడుగదా ! చూస్తూండు, సాయంత్రానికంతా మొదటి ప్రదర్శనం ప్రారంభంగాకపోతే అప్పుడడుగు...''

''అదిసరేరా మూర్తి ! అతడివెనక కూర్చుని వచ్చిందే — సర్కస్‌పిల్ల—అదెవరు ?'' అని అడిగాను.

''అదా ? ఎవరో కొత్తపిట్టయివుంటుంది. నర్సింహులును అడిగావనుకో— 'ఫలానా హిందీ సినిమాలో హీరోయిన్‌గా నటించిన అమ్మాయికి స్వయానా చెల్లెలు' అనేస్తాడు. నువ్వు 'ఆ సినిమా చూశాను. ఆ హీరోయిన్‌కూ, యీవిడకూ పోలికలేవీ లేవే !' అని అంటా వనుకో. 'బహుశా నువ్వు చూసేసరికి ఫిల్మంతా పాడయి పోయి వుంటుంది. గజానికోసారి ఫిల్ము కట్టయిపోయి వుంటుంది' అంటూ మదరాసులోని సినిమా థియేటర్లను గురించీ, అక్కడ సినిమాలకు వచ్చే ఫారిన్ లేడీలను గురించీ వుపన్యాసం మొదలు పెడతాడు.'' అంటూ జవాబిచ్చాడు భాషా.

''మత్తు దిగేదాకా అలా ఆడుతూనే వుంటాడా నర్సింహులు ?'' మళ్లీ వో సందేహాన్ని వెలిబుచ్చాను.

''మత్తు దిగడమా ? ఆ ప్రశ్నేలేదు. నర్సింహులు అన్నం తింటాడనుకున్నావా ? ఊహూం ! తిండీ నీళ్లూ అంతా మందే ! డబ్బు లెక్కువగా వున్నంతవరకూ బ్రాందీలు, విస్కీలు; అయిపో గానే సారాయీ కల్లూ ! తీసుకొచ్చిన వస్తువులను కనాకష్టం ధరలకు అమ్మేస్తాడు. చివరకు బట్టలుగూడా పరాయివాళ్ల సొత్తయిపోతాయి. ఇక యింట్లోని వస్తువులపైన పడతాడు. నర్సింహులు తమ్ముడున్నాడు చూడు — చంద్రం — వాడు యింటి ముందు ఘూర్కాలా కాపలాకాయడం మొదలు పెడతాడు. ఇంట్లోకి రానివ్వకుండా వీధిలోకి తోయడం మొదలు పెడతాడు. 'నన్ను తోయడానికి నువ్వెవడ్రా?' అంటూ బూతులు తిడుతూ వాడిపైన పడతాడు నర్సింహులు. క్రమక్రమంగా వీధిలోని అందరూ గుంపు చేరిపోతారు. శంకరయ్య, చంద్రం, యింకా యింట్లోని అందరూ వొక పార్టీ — నర్సింహులు వొకడే వొక పార్టీ — యుద్ధం ప్రారంభ మవుతుంది. ఇక చూస్కో నాసామిరంగా ! వేడుకంటే వేడుకగాదు. డిటెక్టివ్ సినిమా అయినా అంత యింట్రెస్టుగా వుండదు...''

మూర్తి ఆపగానే భాషా అందుకున్నాడు— ''ఈ రంపు ముగి యాలంటే రెండే దారులున్నాయిరా రాజా ! ఒకటి — ఇంకొంచెంపోసి నర్సింహులును వొళ్లు తెలియకుండా పడిపోయేలా చేయాలి. రెండు — సున్నంలోకి యెముక లేకుండా వొళ్లు హూనం చెయ్యాలి. మొదటి మార్గం కొంచెం కష్టం. రెండోది చాలా సులభం...ఊళ్లో అతణ్ణి తన్ననివాడు పాపాత్ముడు...''

''మాట్లాడుతూ కూచుంటే సమయమే తెలియలేదురా భాషా ! ఒకటిన్నరయింది గంట. భోజనానికింకా రాలేదేమంటూ యింట్లో కంగారుపడుతూ వుంటారు. నేను వెళ్లాలి...''అన్నాడు మూర్తి.

''అవునవును. నేనూ వెడతాను యింటికి ...'' అంటూ తానూ పైకి లేచాడు భాషా.

*　　　*　　　*

చిన్న చిన్న సందుగొందుల్ని మినహాయిస్తే మావూళ్లోవున్న పెద్ద వీధులు మూడు. ఆ మూడు వీధులూ కలిసేచోట తూర్పు దిక్కుకు అభిముఖంగా రాముడి గుడి వుంది. కన్నబిడ్డలు, దగ్గిరి బంధువులూ లేని వొక ముసలి రైతు చనిపోయేముందు తన ఆస్తి నంతటినీ వెచ్చించి ఆ గుడి కట్టిపోయాడు. ఇప్పటికీ గుడిలో ఆయన లైఫ్‌సైజు ఫోటో వ్రేలాడుతూ వుంది.

సాయంకాలం కాను కానూ గుడిమెట్లపైకి మెల్ల మెల్లగా నీడ పరచుకుంటుంది. ముందున్న స్థలంలో చిన్న పిల్లలు గోళీలు, జిల్లాకోడీ లాంటి ఆటలు ఆడుకుంటూ వుంటారు. మాలాంటి నిరుద్యోగ యువకుల కందరికీ సాయంకాలపు సమావేశ స్థలం ఆ గుడిమెట్లే ! మేం ముగ్గురమేకాక యింకా వొకరిద్దరు మా స[illegible] వయస్కులు అక్కడ రోజూ కలుసుకోవడం కద్దు. యధాప్రకారం సాయంకాలానికల్లా అక్కడికి చేరుకున్నాము ఆరోజు మా కబుర్లలో ఎక్కువ శాతం నర్సింహులును గురించిన ముచ్చట్లేనని చెప్పవలసిన అవసరం లేదు.

ఇంతలో ''అదిగో నర్సింహులు ... ఇటే వస్తున్నాడు ...'' అంటూ ప్రకటించాడు భాషా. అందరి ముఖాలూ అటువైపుకు తిరిగాయి.

ఉదయం వేసుకొచ్చిన కోటు తీసేసినట్టున్నాడు. తెల్లటి షర్టుపైన టై మాత్రం అతడిని వదిలించుకోవడం కోసమన్న ట్టుగా విలవిలలాడుతూ ముందు కెగురుతోంది. కోటు తీసేశాక మనిషి చాలా సన్నగా జండాకొయ్యలా కనిపిస్తున్నాడు.

రావడం రావడమే సుడిగాలిలా వచ్చాడు నర్సింహులు. కోడి పిల్లల్ని అదనుచూసి తన్నుకపోయే గ్రద్దలా, వొళ్లు మరచిపోయి ఆడుకుంటున్న పిల్లలపైన పడ్డాడు. వాళ్ల చేతుల్లోని జిల్లాకోడీ వూడలాక్కున్నాడు. దొరికిన గోళీలను దొరికినట్టే బండపైకి విసిరి పగలగొట్టేశాడు. చేతికి దొరికిన పిల్లల చెవులు పిండేశాడు. వాళ్లు కుయ్యో మొర్రో అని అరుస్తున్న అరుపులు చిన్న సైజు తుఫానును గుర్తు చేస్తున్నాయి. చిట్టచివరికి అతడి చేతిలో చిక్కి బిక్కరిస్తూ నిలుచుండిపోయినవాడు బుజ్జిగాడు. వాణ్ణి పారిపోనీ కుండా వొక చెయ్యి మెలితిప్పి పట్టుకుని చచ్చేదీ, బ్రతికేదీ తెలియ

కుండా చావబాదేశాడు నర్సింహులు. విశ్వప్రయత్నంమీద వాడు వది లించుకుని కాలువిరిగిన కుక్కపిల్లలా గొల్లుమంటూ దౌడు తీశాడు.

అందరూ వెళ్లిపోయిన తరువాత అతడికి తీరిక చిక్కి నట్టుంది. "ఫూల్సు...యిడియట్సు...రోగ్సులు..."అంటూ తిట్ట సాగాడు.

ఇదంతా చూస్తూ వూరుకోలేక "అదేంటయ్యా నర్సిం హులూ! వాళ్ల పైన పడ్డావేమిటి? వాళ్లు నిన్నేం చేశారయ్యా బాబూ?" అంటూ ఆక్రోశించాడు భాషా.

"అసలు ఆ పిల్ల వెధవల్ని గాదు తిట్టాల్సింది, మిమ్మల్ని" అంటూ మా వైపుకు తిరిగాడు అతను.

తామరాకు మీద నీటిబొట్టు లాంటివాడు భాషా. నర్సింహు లుతో ఎలా మాట్లాడాలో అతడికి బాగా తెలుసు - "అరరే! అలా కోప్పడుతావేమయ్యా! నిజమే! పొరబాటు మాదేననుకో! అంత మాత్రానికే యింత కోపమా? మేము చిన్నవాళ్లం. నువ్వు పెద్ద వాడివి. ఏం చెయ్యాలో చెప్పడం నీ వంతు. వినకపోతే అప్పు డడుగు..." అంటూ అతడి ముందరికాళ్లకు బంధం వేసేశాడు.

"మీరంతా యంగ్ యువకులు. ఇట్టా వూరికే యెట్లా కూచుంటారు? పిల్లకాయల్నంతా పాడుగానీకుండా చూడాల్నా వన్లేదా? డబ్బులు కలెక్ట్ చేసి వొకలైబ్రరీ పెట్టకూడదా? అందర్నీ కూచోబెట్టి చదివిస్తే యెలా వుంటుంది? అట్లా చెయ్యకుండా లగేజీగా తయారవుతారా?..." మా దగ్గరికి నడుస్తూ అన్నాడు నర్సింహులు.

"నిజమేనయ్యా! మేమూ యెంతో కాలంగా వొక లైబ్రరీ పెట్టాలని అనుకుంటున్నాం. కానీ డబ్బులిచ్చేవాళ్లు యేరీ? పోనీ వొకపని చెయ్యి. ముందుగా నువ్వే బోణీ చెయ్యి. నీ అంతస్తుకు తగ్గట్టుగా నూట పదహార్లు మా మొహాన పడెయ్యి ..." అని అడిగాడు భాషా.

"సర్టెన్‌గా యిస్తాను. పర్సు యింట్లో వుంది. తరువాత తెచ్చిస్తాను. మంచిపనికి నేనెప్పుడే ఫ్రంటే! .."

"అదిసరే నర్సింహులూ, ఉదయం వేసుకొచ్చావే కోటు - చాలా బావుంది. ఎక్కడ కొన్నావు? అదసలు చూడ్డానికి మన దేశా నిదిలా కనబడ్డం లేదు. నాకు తెలుసు - అది తప్పకుండా ఫారిన్‌దే అయివుంటుంది. అవునా?" అంటూ సంభాషణను మరోవైపుకు మళ్లించాడు భాషా.

నర్సింహులువి అసలే పెద్దకళ్లు. అవి మరింత పెద్దవిగా వ్యాకోచిస్తుండగా నవ్వుతూ "అవునవును. దాన్ని మా ఫాదరిన్‌లా తీసుకొచ్చాడు. అంటే మా థర్డ్ వైఫ్ ఫాదరన్నమాట! థర్డ్ వైఫంటే ఎవరనుకున్నావు? ఎప్పుడొచ్చినా దాన్ని తీసుక రాలేదేమని మా యింట్లో పెద్ద గలాటా ... అందుకే యీసారి ఐకప్ విత్ హర్. అసలు నిజానికి యీ కోట్లూ, టైలూ నాకు సరిపడవ్. మా వైఫుందే - వేసుకోకపోతే చాలా ఫీలయిపోతుంది. ఆల్‌మోస్టు వీపింగ్ అనుకో...అందుకే వేసుకుంటాను..."

"అలాగామరి మీ వైఫ్ వుద్యోగం చేస్తున్నారా?..."

"యస్. డి. యస్. టైర్ల కంపెనీ తెలుసా? మీకెలా తెలు స్తుంది? మాలాంటి మెకానిక్‌ల కయితే తెలుస్తుంది. ఆ కంపెనీ జనరల్ మేనేజరుకు పియ్యే మంత్లీ థౌజండ్ డ్రాయింగ్ చేస్తుంది. వాళ్ల నాన్న - అంటే మా ఫాదరిన్‌లా యే బిగ్ ప్రొఫెసరు?"

"ఫారిన్ రిటర్నడా? . " ఆతడి వొకటి సగం యింగ్లీషు పరిజ్ఞానానికి వస్తున్న నవ్వు నాపుకుంటూ అడిగాను.

"ఫారిన్‌గాదు...జర్మనీ వెళ్లొచ్చాడు.."

"అలాగా! అయినా నర్సింహులూ! నిల్చునే మాట్లాడుతున్నా వేమిటి? ఇలా కూర్చో! నువ్వు చెప్పే కబుర్లు వినాలని యెన్నో రోజులుగా యెదురు చూస్తున్నాం..." అన్నాడు భాషా.

"ఊహూ! కూర్చునేటంత టైంలేదు. అర్జెంటు పని పడింది. ఒన్ వీక్ వుంటాన్లే ... లీజర్‌గా వుండేటప్పుడు కని పిస్తాను." అంటూ అతడు తిరిగి చూడకుండా వెళ్లిపోయాడు.

నర్సింహులు దూరంగా వెళ్లిపోయాక 'అంత అర్జెంటు పనేమై వుంటుం'దన్న సందేహాన్ని వెలిబుచ్చాను.

భారతి

చందా వివరములు

	ఏజంటుద్వారా	పోస్టులో
విడి ప్రతి	రు. 1-50	-
6మాసములచందా	రు. 9-00	9-60
సంవత్సరచందా	రు. 18-00	19-20

ఒకేసారి ఆంధ్రపత్రిక ఆఫీసుకు
నేరుగా చెల్లిస్తే సంవత్సరచందా 12-00

మేనేజరు
భారతి

"అయ్యో పిచ్చివాడా! అతడేవైపుకు వెళ్తున్నాడో చూడు అటువెళ్తే వాళ్ల ఇల్లురాదు. బ్రాందీషాపు మాత్రం వస్తుంది." అన్నాడు మూర్తి.

మా భాషా పరిభాషలో చెప్పాలంటే నర్సింహులు తన ప్రదర్శనల్ని మరునాటి సాయంకాలానికిగానీ మొదలు పెట్టలేదు. మొదలు పెట్టినప్పటినుంచీ యెక్కడ పడితే అక్కడ వినోదం వీధిలో యెప్పుడు పడితే అప్పుడు దొరుకుతోంది. మా పేకముక్కలపైన, చెస్ బోర్డుపైన దుమ్ము పేరుకపోయి వుంటుంది.

నర్సింహులు ప్రదర్శనాల్ని రెండు రకాలుగా విభజించవచ్చు. ఒక రంగం తరువాత మరొక రంగంలా మధ్య మధ్య విరామాన్ని కల్పిస్తూ సాగిపోయే ప్రదర్శనాలు మొదటి రకం. ఆ విరామ సమయంలో ప్రేక్షకుల్ని యెంటర్‌టెయిన్ చేయడంకోసం తయారు చేయబడిన 'టిట్ బిట్స్' లాంటి ప్రదర్శనలు రెండో రకం.

ఓరోజు వొకప్పుడు బాగా బ్రతికి ప్రస్తుతం అప్పూట కాప్పూటకుకూడా తడుముకోవలసి వస్తున్న మావూరి మాజీ ప్రెసిడెంటు యింటిముందు తిష్టవేసేశాడు. వాళ్లింట్లో పాడైపోయిన ట్రాన్సిస్టరొకటి వుందని చెప్పారట ఎవరో — తెచ్చిస్తే అక్కడి కక్కడే అలా వీధిలో కూర్చునే రిపేరు చేసిస్తానని గోలచేయసాగాడు. తాగుబోతుకిస్తే బాగుచేయడంమానె, యే పార్టుకాపార్టు వూడబెరికి కుప్పతొట్టిలోకిమాత్రం అలంకారంగా తయారు చెయ్యగలడని యెవరికి తెలియదు? ఇవ్వనంటే అతడూరుకున్నాడా? తెచ్చుకున్న డబ్బులయిపోయాయి, ఓ పది పారేస్తే వెడతానన్నాడు. చివరకు వో అయిదు చదివించుకున్న తరువాతగానీ ఆయన వూపిరి పీల్చుకోలేకపోయాడు.

గుడిలోకి నీళ్లు తెచ్చిపోయడానికి రంగమ్మంటూ వొకావిడ వుంది. ఓసారి నర్సింహులు తాగి తూలుతూ వెళ్లి ఆమె మీదపడి తీసుకొస్తున్న కుండకాస్తా పగలగొట్టేశాడు. బంగారంలాంటి కుండ పోయిందని ఆమె నోరు జారిందట! ఇంట్లోవున్న కుండల్ని కూడా పగలగొట్టేస్తానని ఆవిడ యింటిపైకి వెళ్ళాడు నర్సింహులు. తలుపు గడియవేసుకుని గుడిసె లోపల రంగమ్మ—బయట తలుపు పగలగొట్టేస్తానంటూ అతడు—చివరకు ఎక్కడో పనిమీద బయటికెళ్లిన ఆమె మొగుడొచ్చేదాకా వినోద ప్రదర్శనం నిరాఘాటంగా సాగిపోయింది. అతడొచ్చి నర్సింహుల్ని వీధిలో పొర్లించి పొర్లించి చావగొట్టాడు. చివరకు స్పృహతప్పి వీధిలోనే పడిపోయిన నర్సింహుల్ని చంద్రంవచ్చి యింటికి మోసుకెళ్లాడు.

నాలుగురోజుల తరువాత వొకనాటి వుదయం నర్సింహులు తాజా భార్య పలాయనం చిత్తగించిందన్న సరికొత్త వార్తనుమోసుకొచ్చాడు భాషా. ఇంట్లోనే జరిగినందువల్ల అది శ్రవ్యరూపకం మాత్రమే! నర్సింహులు ఆమెనేదోఅడిగాడు. ఆవిడేమో అంది. ఆమె వీపు పగిలిపోయింది. ఇంట్లో వాళ్లకూ, బయటి వాళ్లకూ అర్థంగాని సరిక్రొత్త భాషలో ఆమె చచ్చిన కాకినిచూసి గొంతు చించుకునే తోటి కాకిలా రోదనచేస్తూ తనపెట్టాబేడా చేతబట్టుకుని బస్సెక్కేసింది. తెల్లవారిజామున బస్సెక్కినప్పుడు చూసినవాడు ఆమె పోనీటెయిల్లో సగం చిక్కిపోయి వుందని చెప్పాడట! బహుశా అందుకు కారణం నర్సింహులే అయివుంటాడని మా భాషా వూహ!

నర్సింహులు వూరికివచ్చి వారంరోజులు కావస్తున్నాయి.

ఇప్పుడు అతడి ఆకారం వచ్చినప్పుడున్న ఆకారానికి పూర్తిగా విరుద్ధంగావుంది. తీసుకొచ్చిన బట్టల్నికూడా అమ్మేసినట్టున్నాడు. వచ్చినప్పుడు తొడుక్కున్న బట్టలే మసిగుడ్డల్లా వ్రేలాడుతున్నాయి. షర్టు సగానికి సగం చినిగిపోయింది. పాంటుకు మోకాళ్లవద్ద అయిదారు అంగుళాల మేరకు రంధ్రాలు యేర్పడ్డాయి. క్రింది భాగాన పోగులు పోగులుగా వ్రేలాడుతోంది. తారోడ్డు పనిచేసే కూలివాళ్ళు తొడుక్కునే తోలు చెప్పుల్లా తయారయ్యాయి బూట్లు. సాక్సులున్న సూచనయినాలేదు. టై యేమయిపోయిందో యేమో! పిచ్చుకగూడులాంటి తలవెంట్రుకలు... బహుశా ఆదిమ మానవుడు అలా వుండేవాడేమో! లేకుంటే సంవత్సరాల తరబడీ నిద్రపోయి లేచిన రిప్‌వాన్‌వింకుల్ యిలా తయారై వుంటాడు.

ఆకారం అలా రూపొందేసరికి అతడి ప్రదర్శనలు మరింత రసవంతంగా కొనసాగుతున్నాయి. వీధిలోకొచ్చి నిలుచుంటేచాలు — ఎక్కడో కొద్దిగా అలజడి వినిపిస్తుంది. క్రమంగా పెరిగి పెద్దదవుతుంది. వెళ్లి చూడ్డానికి నిలుచుంటే చాలు — ఎంతసేపయినా బోరన్న ప్రశ్నేలేదు.

ఒకనాడు సుప్రభాతంలా తెల్లవారిజామున నాలుగు గంటల ప్రాంతంలోనే మొదలయింది నర్సింహులు ప్రదర్శన. అలజడికి మెలకువ వచ్చేసింది. వీధిలోకి వచ్చి చూశాను. ఈ ప్రదర్శనలో పరాయివాళ్లతో అతడు చెలగాట మాడడంలేదు. ఏకంగా తల్లి తండ్రులపైన్నే యుద్ధం ప్రకటించాడు. నర్సింహులు మొదటి భార్య నిన్నసాయంకాల మెప్పుడో పుట్టింటికి వుడాయించేసిందట! తన భార్యని తన అనుమతి లేకుండా వూరికెవరు పంపమన్నారని అతడి ఫిర్యాదు. నిజానికి పెళ్ళాడడం, బిడ్డల్ని కనడం మినహా భర్తగా నర్సింహులు భార్యకు వొరగబెట్టిందేమీలేదు. అందువల్ల చెప్పాల్సిన అవసరమేమీలేదని శంకరయ్యవాదన ... తాగుబోతుతో నీకెందు కొచ్చిన గొడవలెమ్మంది శంకరయ్యభార్య. తల్లిదండ్రులిద్దర్నీ యింగితా యింగితాలు లేకుండా కాస్సేపు తెగ బూతులు తిట్టాడు నర్సింహులు. తరువాత 'నా పెళ్లాన్ని నాకు కానీకుండా చేస్తున్నారు బాబో' అంటూ యేడవబోయాడు. ఓపికున్నంత వరకూ ఆగి, తరువాత గూబ గుయ్యిమనేటట్టుగా నాలుగిచ్చుకున్నాడు శంకరయ్య. దాంతో అతగాడి ఆగడం మరింత యెక్కువయింది. చివరికో నిర్ణయాని కొచ్చిన శంకరయ్య సుపుత్రుణ్ణి కరెంటు స్థంబానికి కట్టిపారేశాడు. మాటాడనివ్వకుండా నోటినిండా పాతగుడ్డ దోపేశాడు. అంతటితో ప్రదర్శన ముగిసింది.

ఇంటికొచ్చి ముఖం కడుక్కున్నాను. టిఫెనుకు కూచోబోతుండగా 'అయ్యగారు కొడవళ్లు తెమ్మన్నా'రంటూ వచ్చాడు

పాలేరు. వాటిని తీసివ్వడంకోసం పనిముట్లన్నీ పెట్టుకునే గది వైపు నడచాను.

గదికి బీగం వేయలేదు గడియమాత్రం వేసివుంది. తెరిచి లోపలికి అడుగుబెట్టబోయినవాడినల్లా అలాగే దిగ్భ్రాంతుడినై పోయాను. ఎదురుగా వొకస్త్రీ ... మోకాళ్ళు గుండెలకు దగ్గరగా పెట్టుకుని కూర్చోవడంవల్ల యెంత పొడుగో తెలియడంలేదు. కట్టుకున్న నీలంరంగుచీర అక్కడక్కడా రంగు పోగొట్టుకునివుంది. ఎర్రటి జాకెట్టు ఆ చీరకేమాత్రమూ మాచింగ్ కాలేదు. నెరవని వెంట్రుకలు, మిగిలిన శరీరం వయస్సు పాతికేళ్ళని చెబుతున్నా, ముఖంలో అప్పుడే వృద్ధాప్యం కనబడుతోంది. టార్చిలైటు వెలుతురు ముఖాన పడగానే యిక కదలలేక భూమిపైకి అణిగిపోయి, స్థాణువులా మారిపోయే కుందేలులా ఆమె ... గ్రద్దబారినుంచీ తప్పించుకోవడం కోసం పెట్టరెక్కలక్రింద నక్కిపోయే కోడిపిల్లలా ఆమె కిరువైపులా యిద్దరు పిల్లలు...

నేను లోపలికి అడుగుపెట్టగానే ఆమె సర్దుకుని కూర్చుంది. నాకేం చేయాలో తోచలేదు. మౌనంగా కొడవళ్ళు తీసుకొని బయటికొచ్చేశాను. మామూలుగా గడియ వేసేశాను.

కొడవళ్ళు తీసుకొని పాలేరు వెళ్ళిపోయినతరువాత "మూల గదిలో యెవరో వున్నారమ్మా!" అంటూ కంగారుగా మా అమ్మకు చెప్పాను. రహస్యం చెప్పబోతున్నట్టుగా ఆమె దగ్గరగావచ్చి "ఎవరికీ చెప్పొద్దురా తండ్రీ! ఆ తాగుబోతు వెధవకు తెలిసిందంటే మన పైకొచ్చినా వస్తాడు జగడానికి..." అంది.

"అంటే... అంటే?"

"అదే... శంకరయ్య కోడలు... దాని చెవుల్లోవీ, మెడలోవీ —అన్ని నగలూ యేటిపాలు చేసేశాడు ఆ నర్సింహులు . మిగిలిందొకటే...నల్లపూసల బంగారు గొలుసు... దాన్నివ్వమంటూ కూచున్నాడట.. ఇవ్వకపోతే తన్ని తగలేస్తాడు. ఎలాగైనా యింట్లో దాచిపెట్టమని తీసుకొచ్చి అప్పగించి పోయింది శంకరయ్యపెళ్ళాం... బయట యెవరికీ చెప్పొద్దు..." అంటూ అమ్మ వెళ్ళిపోయింది.

దట్టంగా పరుచుకున్న మేఘాల కవతల యేదో నక్షత్రం మినుకు మినుకుమంటూ మెరిసినట్టుగా అంతవరకు అవగతంగాని సత్యం వొకటి స్ఫురించింది. హృదయంలో యేమూలో మెల్లగా కలుక్కు మన్నట్టుగా తోచింది. టిఫెను రుచించలేదు. వీధిలో కెళ్ళలేకపోయాను. ఇంట్లో నిలువలేకపోయాను.

"అలా కాలుగాలిన పిల్లిలా తిరగకపోతే పొలానికెళ్ళి మీ నాన్న కేమయినా సాయం చేయరాదేమిట్రా?" అంటూ కసిరింది అమ్మ.

ప్రస్తుతానికి అదే మంచి పనిలా తోచింది. పొలానికెళ్ళేసరికి సూర్యుడి ప్రతాపాన్ని సాకు చేయమన్నట్టుగా కోతపనిలో మునిగిపోయిన కూలీలు కనిపించారు.

"ఇదేమిట్రా, యిలా వచ్చావు?" అన్నారు యజమాయిషీ చేస్తున్న నాన్న.

"ఊరికేనే!..." అంటూ చూస్తూ నిల్చున్నాను.

కాసేపు గడచిన తరువాత నేనూ కోయగలనేమోనని ప్రయత్నంచేశాను. అయిదు నిముషాలు కాకముందే చేతులు నొప్పెట్టాయి. గట్టుపైనకూచున్నాను. మధ్యాహ్నం అక్కడికే భోజనం వచ్చింది.

సాయంకాలం అయిదు గంటల ప్రాంతంలో "నువ్వింటికెళ్ళరా బాబూ! ఇంతసేపున్నది చాలుగానీ..."అన్నారు నాన్న.

పొలం పనుల్లో కొంచెం ఆనందం చేకూరింది. ఇంటికి బయల్దేరాను. ఆలోచించుకుంటూ గట్టుపైన నడుస్తున్నాను.

డబ్ డబ్ మంటూ శబ్దం వినిపించింది. ఏమిటోనని మొదట పట్టించుకోలేదు. అలాంటి శబ్దమే మళ్ళీ మళ్ళీ వినిపించింది. నిలుచున్నచోటునే ఆగిపోయి చుట్టూచూశాను.

అక్కడో పాడుబడిన బావి వుంది. ఒకప్పుడు దానికి మిషెన్ సెట్టు గూడా వుండేది. పైప్ నుంచీ వచ్చేనీళ్ళు మొదట తొట్టిలోకి వచ్చిపడి ఆ తరువాత బయటికొచ్చేవి. ఆ మిషన్ సెట్టు, పైపులు లేకపోయినా ఆ తొట్టి మాత్రం యింకా అలాగే వుంది. పైనమాత్రం వొకటి రెండు వరుసల రాళ్ళు పడిపోయాయి. అందులోంచీ వస్తోంది శబ్దం.

దగ్గరికి వెళ్ళి తొంగి చూశాను.

వెంటనే ముక్కు మూసుకున్నాను.

లోపల కుళ్ళిపోయిన ఆకులు, రకరకాల రాళ్ళు, గోడలపైన మొలిచిన గడ్డి—గడ్డినీ, రాళ్ళనూ వొకవైపుకు తోసిపారేసి, వీలయినంత ఖాళీ స్థలాన్ని యేర్పరచుకొని కూర్చొనివున్నాడు వో పదేళ్ళ కుర్రాడు. బయటి ప్రపంచాన్ని పూర్తిగా మరచిపోయి ఆ కాస్త స్థలంలోనే వొక్కడే గోలీలాడుకుంటున్నాడు ...

"ఎవర్రా నువ్వు?"

వాడు తలెత్తి చూశాడు.

"రేయ్ బుజ్జీ! ఇక్కడేం చేస్తున్నావురా?" అంటూ ఆక్రోశించాను.

"గోలీలు...గోలీలు.." గోలీలు చూపెడుతూ బిక్కమొహం పెట్టాడు వాడు.

"గోలీలాడుకోడం యిక్కడేనా? బయటెక్కడా స్థలందొరకలేదా నీకు?.."

"బయట ఆడుకుంటే, మా అన్న చూసాడంటే చావగొడతాడు."

"ఎవరూ? నర్సింహులేనా?"

"అవును..."

సమాధానం విన్న తరువాత నా ప్రశ్నెంత అసంగతంగా వుందో బోధపడింది.

''కొడితేమాత్రం అక్కడా ఆడుకోవడం ? బయటికిరా ... నీకు యింకెక్కడయినా మంచి చోటు చూపెడతాను'' అన్నాను.

''ఒద్దొద్దు .. నా కిక్కడే బాగుంది ... ఇంకెక్కడయినా అయితే మా అన్నకు తెలిసిపోతుంది...''

నేను సందేహించడం చూసి ''నే నింకెక్కడికీ రాను ... ఇక్కడే వుంటాను. ఇక్కడే బాగుంది.. '' అన్నాడు వాడు మళ్లీ.

నాకేం చెయ్యాలో పాలుపోలేదు. మౌనంగా వెనక్కు వచ్చి దారివెంట నడవసాగాను. మళ్లీ మామూలుగా గోలీల శబ్దం విని పించసాగింది. ఆశబ్దం రెట్టింపై, భరించలేనంత శబ్దంగా మారి నట్టు తోచి కలవరపడసాగాను.

తగిలిన కాలికే మళ్లీ తగిలినట్టుగా వుదయం జరిగిన సంఘ నకు తోడు యీ సంఘటన...మనసంతా కెలికినట్టుగా వుంది...

ఇంటికెళ్లబోతుండగా వీధిలో యెదురైన భాషా ''అరరే ! ఎక్కడికెళ్లావు యీ రోజంతా ! ఈరోజేం జరిగిందనుకున్నావు ? నర్సింహులు చూపులు యీసారి మన రంగనాథంపైన పడ్డాయి... అసలు'' అంటూ యేదో చెప్పబోయాడు.

''సారీ భాషా! ఎందుకో చీకాకుగా వుంది. తలకూడా నొస్తోంది. ఇంటికెళ్లి కాఫీ త్రాగి వస్తాను...'' అని సమాధానం చెప్పి యింటికొచ్చేశాను.

కాఫీ త్రాగి యీజీ చేర్లో వాలిపోయాను.

అలా యెంతసేపు కూచున్నానో నాకే తెలియదు.

''ఈ కొడవళ్లు, కత్తులు ఇవంతా గదిలో పెట్టాలండీ!'' అంటున్న పాలేరు మాటలు విని వులిక్కిపడి పైకి లేచాను. వాటిని అందుకొని గదివైపుకు నడచాను.

గది తెరవగానే మళ్లీ వులిక్కిపడ్డాను.

ప్రొద్దున చూసిన దృశ్యం అలాగే యెదురయింది.

ఆమెలో మళ్లీ అదే తడబాటు ..

సామాన్లన్నీ నేలపైన పారేసి ''ప్రొద్దున్నుంచీ యిక్కడే వున్నావా ?'' అంటూ ఆక్రోశించాను.

నా ఆక్రోశం ఆమెకు మరోలా అర్థమయినట్టుంది. ''ఈ రాత్రి కెట్లయినా యీడ్నే తలదాచుకుంటాను. ఎల్లిపొమ్మనొద్దు సామీ ! చచ్చి నీ కడుపులో పుడతా'' జీరవోయిన గొంతుకతో వేడుకొంది ఆమె.

''అదిగాదు . అదిగాదు ... మరి అన్నం ... అంటే భోం చేశావా ?...''

''ఊహూ! తిన్లేదు...ఒద్దు . నాకాకిలిగా లేదు . ఒకనాటికే తిండిలేకపోతే సచ్చిపోతానా, యేమయినానా?...'' పైకి పెగల్చుకొని వస్తున్న యేడుపునాపుకుంటూ అంది.

''అదిసరే...మరి పిల్లలు...''

''వాళ్లకూ వొద్దులెండి...''

''వాళ్లనయినా యింటికి పంపకపోయావా ? వాళ్లను కూడా కొడతాడా యేమిటి? వాళ్లేం పాపం చేశారు ?''

''ఎవరు మాత్రం యేం పాపం చేసినారు సామీ! కనిందే ఆ అమ్మా – అయ్యా చేసిన పాపమా ? కూడా పుట్టిందే చంద్రయ్య జేసిన పాపమా ? కట్టుకునిందే నేన్జేసిన పాపమా ? నా కడుపులో పుట్టిందే యీ పసికూనల పాపమా ? ఎవురేం పాపం చేసినారు ? ఎందుకయ్యా మాకీ శిక్ష ?''

''అతణ్ణి తాగకుండా చూడ్డానికి మరేమీ దోవలేదా?'' అని ప్రశ్నించాను.

''దోవా ? చచ్చిపోయే దాకటే దోవ ... మేమో. ఆయనో యెవరో వొకరు చచ్చిపోతే పీడాపోతుంది. బొమ్మరిల్లు మాదిరిగా సక్కనైన కాపరం. పోతే పోయినాడు, వుండి యేం వుద్ధరించి నాడు ? – అనుకోని వుండేందీ, లేదీ సరిజేసుకోని కొంచెం సంతోషంగా బతకతా వుందామని అనుకునేటప్పుడు వస్తాడు పాపం మాదిరిగా! అంతే! కాపురం కుక్కలు చింపిన పుల్లిస్తరాకే! మేమందురు మింగాలేక, కక్కాలేక. తలెత్తుకోని తిరగలేక కుళ్లి కుళ్లి యేడస్తావుంటే వచ్చిన పని అయిపోయినట్టు పరారయి పోతాడు. మళ్లా ఆ అప్పులు తీర్చుకోని గడ్డకొచ్చేదానికి తాతముత్తాతలు దిగొస్తారు. ఆకాడికి మళ్లా వచ్చేస్తాడు '' ప్రొద్దున్నుంచీ దాచిపెట్టుకున్న యేడుపు జాలి చూపెట్టే ప్రాణి కనిపించేసరికి పెల్లుబుకుతోంది.

''సరే, నేనువెళ్లి పిల్లలకయినా అన్నం పంపమని చెబుతాను మా అమ్మతో.. '' అంటూ వెనుదిరిగి బయటికి రాబోయాను.

''ఈ పూటకు పెడతారు, మాపిటికి పెడతారు. దినమూ పెడతారా? మా రెక్కల కష్టం మేం తినేదానికే దోవా తెన్నూ లేదు. పోతా పోతా వూరికా పోకుండా కొమ్మలించేసి పోయే దెయ్యం మాదిరిగా పోతాడు. అప్పలు కట్టలేక మామపడే బాధ లెవురికి తెలస్తాది ? వీదిలో తలెత్తుకోని తిరగలేకుండా మూడ్రోజులనాడు పోయినాడు చంద్రం. ఏడికి పోయినాడు, యేమో, అయిపు లేదు. బయటికిపోతే యేం చేస్తాడో యేం పాడోనని బయటికి పోకుండా, ఆకిలనయినా చెప్పకుండా వుండజాట్టుకోని పోతావుండారు ఈ పసి కందులు. ఎందుకో మాకీ శిక్ష ?.. ''

వెనుదిరిగి ఆమె ముఖం చూసే సాహసం కలగలేదు.

అమ్మతోచెప్పి పిల్లలతోబాటూ ఆమెకూ అన్నం పంపించాను.

ఆరోజు రాత్రంతా సరిగ్గా నిద్రపట్టలేదు. ఏం చేశారని ఆ కుటుంబానికి ఆ శిక్ష? అర్ధరాత్రి వరకూ మగత నిద్రయినా పట్టింది. అప్పుడు హఠాత్తుగా ఆమె ఆత్మహత్య చేసుకుంటుం దేమో నన్న అనుమానం వచ్చింది. తొలిండులు . తాళ్లు . ఒకటా రెండా...చాలాసామాన్లు వున్నాయి ఆగదిలో . చావాలని అనుకుంటే కావలసిన పరికరాలన్నీ అందుబాటులో వున్నట్టే లెక్క. ఆ ఆలోచన వచ్చిన తరువాత మగత నిద్రయినా నన్ను కనికరించలేదు. తెల్లవారు జామున యెప్పుడో ఆదమరచి నిద్రపోయాను.

నిద్ర లేచిన తరువాత మొహం కడుక్కుంటూ వుండగా కాలుతున్న కడుపులో పాలు పోసినట్టుగా తాజా వార్తను మోసు కొచ్చాడు మూర్తి. శంకరయ్య, చంద్రం–యింకా ముగ్గురు నలుగురు కలిసి యిక యిలా కుదరదని నర్సింహులు చేతులూ, కాళ్లూ కట్టి రైల్లో పడేశారట! చంద్రం మాత్రం టికెట్టుకొని రైలెక్కాడు. వెళ్లి మదరాసు సెంట్రల్ స్టేషన్లో తోసిపారేసి తిరిగొస్తాడట!

రాత్రంతా నిద్రలేక పోవడంవల్ల కలిగిన చీకాకంతా వొక్కసారిగా తీసిపారేసినట్టయింది. హాయిగా నిట్టూర్చాను.

వారం రోజులు గడచాయి.

పోతూ పోతూ నర్సింహులు చేసిపోయిన అప్పులన్నీ మెల్ల మెల్లగా తీర్చుకుంటానని మొరబెట్టుకుని అందరినీ వొప్పించాడు శంకరయ్య.

చంద్రం గూడా వీధిలో ధైర్యంగా తలెత్తుకుని తిరుగుతున్నాడు.

అన్నబిడ్డలిద్దరూ అంగరక్షకుల్లా దిగంబరంగా తనవెంట తిరుగుతూ వుండగా బుజ్జిగాడు గూడా వీధిలోనే గోలీలాడుకుంటున్నాడు.

నెల రోజులు గడచాయి.

ఒకనాడు నేను, భాషా, మూర్తి, మా యింటిలో మేడమీది గదిలో కూర్చుని పేకాడుకుంటున్నాం.

ఉన్నట్టుండి కిటికీలోంచి తొంగిచూసి ''వచ్చేశాడు'' అన్నాడు మూర్తి ఆనందంగా.

''అవునవును...మళ్లీ వచ్చేశాడు ..ఇక కాలక్షేపానికి కొదవే లేదు'' అంటూ కేకేశాడు భాషా.

నేనూ తొంగి చూశాను.

ఉన్నట్టుండి భయంతో కంపించిపోయాను.

నా కళ్ల కెదురుగా కుళ్లిన ఆకులమధ్య దుర్వాసనలో గోలీలాడుకుంటున్న బుజ్జిగాడు కనిపిస్తున్నాడు. మానవుడికి కావలసిన ప్రాథమిక అవసరం – స్వేచ్ఛను కూడా కోల్పోయి, కన్నబిడ్డలకు వేళకింత తిండయినా పెట్టలేక యేడుస్తూ కూచున్న నిస్సహాయురాలు యెందుకీ శిక్షని ప్రశ్నిస్తోంది. ఊళ్లో తలెత్తుకుని తిరగలేక పలాయనం చిత్తగించిన చంద్రం కనిపిస్తున్నాడు. పరిస్థితులు స్థాణువుల్లా తయారుచేసిన తల్లిదండ్రులు కనిపిస్తున్నారు.

అవును ... వచ్చేశాడు.

నర్సింహులు మళ్లీ వచ్చేశాడు.

నాలో నీవు...

సారా

నా యెదలోతులు తడిమిన
నీవు
గుర్తుకు వచ్చినపుడు,
గుండె లయ తప్పడం, నీరవడం.
ఈక్షణం ...
భవిష్యత్తుకు తావులేని వర్తమానం

వర్తమానం నిండా ఆవరించిన గతం
ఆ గతంలో నీవు నేను ...
నేను
నా హృదయంలో
గత అనుభవాలు
దాగిన చోటు వెదుక్కొంటూ...!